ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 19 ఆగస్టు 2025



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నందికొట్కూరులో అత్యధికంగా 54.0మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా బనగానపల్లెలో 12.6మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షానికి పలు మండలాల్లో మొక్కజొన్న, అరటి, జొన్న, పత్తి పంటలు నీట మునిగాయి. దీంతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. భవనాశి నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సమీప మండలాలు, గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో ఇటుకబట్టీలు సైతం నీట మునిగాయి. కొత్తపల్లి మండలం శివపురం, లింగాపురం గ్రామాల మధ్యలోని ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఆత్మకూరు శివార్లలో ఉప్పొంగి ప్రవహిస్తున్న భవనాశి నది



వానలే.. వానలు..!

'భవనాశి'కి వరద ఉధృతి

ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో కురుస్తున్న భారీ వర్షాలతో భవనాశి నదికి మరోసారి వరద కొనసాగుతోంది. ఆదివారం భారీవర్షం కురియడంతో 47.8మిమీ వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు ఏకమై భవనాశితో కలిసి ప్రవహించాయి. ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. భవనాశి నది పరిసరాల్లోని పొలాలు, ఇటుకల బట్టీలు నీటమునిగాయి. కురుకుంద గ్రామాని కి చెందిన పుల్లయ్య, వెంకటేశ్వర్లు, లింగస్వామి అనే ముగ్గురు కురుకుంద నుంచి ఆత్మకూరు బైక్‌పై వస్తుండగా భవనాశి నది దాటుతూ.. వరద ఉధృతికి తట్టుకోలేక కొట్టుకోపోయారు. అక్కడే ఉన్న కొందరు ముగ్గురిని రక్షించినప్పటికీ బైక్, వారి సెల్‌ఫోన్లు కొట్టుకుపోయాయి. వరదరాజ స్వామి ప్రాజెక్ట్ (వీఆర్‌ఎస్పీ)లోకి భారీగా వర్షపు నీరు చేరింది. అదేక్రమంలో ప్రాజెక్ట్‌లో గరిష్ఠ స్థాయిలో 0.38 టీఎంసీల నీటి ఉండటంతో మునిమడుగుల వాగుకు నీటి విడుదల చేపడుతున్నారు. సోమవా రం ఉదయం ఒక్కగేటు ద్వారానే 600 క్యూసెక్కుల మేర నీటి విడుదల చేపట్టినప్పటికీ మధ్యాహ్ననికి ప్రాజెక్ట్‌లోకి నీటి ప్రవా హం పెరగడంతో రెండు గేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీటి ని విడుదల చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి నీటివిడుదల జరుగుతున్న దృశ్యం

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నందికొట్కూరు, కొత్తపల్లె, ఆత్మకూరు, మిడ్తూరు, బండిఆత్మకూరు, వెలుగోడు, చాగలమర్రి మండలాల్లో కురిసిన భారీ వర్షానికి పంటలు నీటమునిగాయి. మొక్కజొన్న, అరటి, జొన్న, పత్తి మొదలైన పంటలు సుమారు 400 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. నందికొట్కూరులో అత్యధికంగా 54.0ఎంఎం వర్షపాతం నమోదైంది. కొత్తపల్లె 50.8, ఆత్మకూరు 47.8, మిడ్తూరు 43.4, బండిఆత్మకూరు 38.0, వెలుగోడు 37.6, జూపాడుబంగ్లా 36.8, పగిడ్యాల 36.8, పాములపాడు 34.8, గడివేముల 31.4, శ్రీశైలం 31.4, మహానంది 29.4, రుద్రవరం 27.2, నంద్యాల పట్టణం 25.0, నంద్యాల మండలం 23.6, శిరువెళ్ల 20.2, సంజామల 19.8, చాగలమర్రి 19.2, పాణ్యం 18.0, ఉయ్యాలవాడ 18.0, ఆళ్లగడ్డ 17.6, దొర్నిపాడు 16.8, గోస్పాడు 16.2, కోవెలకుంట్ల 15.4, బనగానపల్లె 12.6ఎంఎం వర్షపాతం నమోదైంది.

ఉప్పొంగిన ఎద్దులేరు వాగు

కొత్తపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షాలకు శివపురం, లింగాపురం గ్రామాల మధ్యలోని ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. మండలంలోని సుమారు 20 గ్రామాలకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు ప్రమాదం అని తెలిసినప్పటికీ అతికష్టమీద ట్రాక్టరు సాయంతో వాగును దాటుతున్నారు. గతంలో ఈ వాగు దాటుతూ నలుగురు వ్యక్తులతో పాటు మూగజీవాలు సైతం మృతి చెందిన సంఘటనలున్నాయి. వరద ఉధృతిని తహసీల్దార్ ఉమారాణి, ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ వాగు దాటకుండా రెవెన్యూ, పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశారు.

- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- దెబ్బతిన్న పంటలు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- వీఆర్ఎస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- ట్రాక్టర్‌తో ఎద్దులేరు వాగును దాటుతున్న ప్రజలు
- నందికొట్కూరులో అత్యధికంగా 54.0 మి.మీ.ల వర్షపాతం నమోదు
- అత్యల్పంగా బనగానపల్లెలో 12.6 మి.మీ.ల వర్షపాతం..

పాఠశాలలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు డీఈవో జనార్దన్‌రెడ్డి సెలవు ప్రకటించారు.



భవనాశి నదిలో చిక్కుకుని బయటపడిన కురుకుంద వాసులు



ట్రాక్టరు సాయంతో ఎద్దులేరు వాగు దాటుతున్న ప్రజలు



ఆత్మకూరులోని భవనాశి నది సమీపంలో నీటమునిగిన ఇటుకలు బట్టీలు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి
- ప్రజలు ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండండి
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. భారీ వర్షాలు, గాలివాన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడితే ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌ను త్వరితగతిన పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు నేలకొరగడం, విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు రాకపోకలకు, ప్రజారవాణాకు అంతరాయం రాకుండా వాటిని తొలగించడంతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా బలహీనంగా కల్వర్టులు, వంతెనలు కోతకు గురయ్యే అవకాశమున్నందున రహదారుల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు నదులు, వాగులు, వంకలు, చెరు వులు, కాల్వలు, పరిసర ప్రాంతాల్లో గండ్లు పడే అవకాశం నేపథ్యంలో లోతట్టు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని క్షేత్రస్థాయి అధికారులను మంత్రి ఆదేశించారు.

కూలిన సైడ్ వాల్

- ప్రమాదంలో 21వ బ్లాక్‌ఛానెల్ తూము
- బలహీనంగా మారిన తెలుగు గంగ కాల్వ గట్టు
- ఎక్కడ గండిపడుతుందోనని ఆందోళనలో రైతులు

రుద్రవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగ మెయిన్ కెనాల్ రక్షణ గోడ (సైడ్‌వాల్) సోమవారం కూలింది. రుద్రవరం సమీపంలోని తెలుగుగంగ ప్రధానకాల్వలో భాగంగా 21వ తూము వద్ద కూలిపోయింది. తూముకు ప్రమాదం పొంచి ఉంది. గట్టుపై వాహనాలు తిరగకుండా రాళ్లు అడ్డుపెట్టారు. సైడ్‌వాల్ కూలడంతో గట్టు బలహీనంగా మారింది. ప్రధాన కాల్వలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎక్కడ గండి పడుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి రైతులు తీసుకెళ్లినట్లు తెలిపారు. కాల్వగట్టుకు గండి పడితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైతులు వాపోయారు.



రుద్రవరం సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ 21వ తూము వద్ద కూలిన సైడ్ వాల్

అవయవదానంపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ రాజకుమారి



నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. నంద్యాల పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జూన్ నెలలో అవయవదానం చేసిన మహిళ సుజాత కుటుంబ సభ్యులకు కలెక్టర్ రూ.50వేల నగదు పారితోషకం, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితంలో వెలుగులు నింపే అవకాశం ఉంటుందన్నారు. సుజాత తెల్లపురి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తుండేవారని, జూన్ 1వతేదీ రోడ్డు ప్రమాదానికి గురి కాగా వైద్యులు ప్రాణాలను కాపాడేందుకు ఎంతో కృషిచేశారని గుర్తు చేశారు బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమె సోదరి డాక్టర్ విజయ, సోదరుడు సునీల్ కుటుంబసభ్యులను అవయవదానానికి ఒప్పించి రెడ్‌క్రాస్‌ను సంప్రదించారని తెలి పారు. సుజాత అవయవదానం ద్వారా ఏడు మంది జీవితాల్లో వెలుగులు నింపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్‌వో రామునాయక్ పాల్గొన్నారు.

నేడు శ్రీశైలానికి మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ఆత్మకూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం నుంచి రెండు రోజుల శ్రీశైల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజైన మంగళవారం ఉదయం 9గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి శ్రీశైలానికి రానున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో సున్నిపెంటలోని ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమంపై జరిగే సమీక్షకు హాజరు కానున్నారు. ఆ తర్వాత శ్రీశైలానికి చేరుకుని భ్రమరాంబ అతిథి గృహంలో బస చేయనున్నారు. బుధవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు. 11.30 గంటలకు శ్రీశైలంలోని చెంచు మ్యూజియంలో ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెటింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేయను న్నారు. మధ్యాహ్నం ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీ లోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి వన్ ధన్ వికాస్ కేంద్రం ద్వారా ఏర్పాటు చేయనున్న నల్లమల నన్నారీ తయారీ కేంద్రా న్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి విజయ వాడకు బయలుదేరనున్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి శ్రీశైలం ఐటీడీఏ అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.

మహానందిలో దోపిడీ పర్వం

- అన్నదానం నుంచి.. ఉచిత మరుగుదొడ్ల వరకు ఆగని దందా
- చక్రం తిప్పుతున్న ఇద్దరు అధికారులు
- అడ్డదారిలో జీతాలు డ్రా.. • మంత్రి ఆదేశాలు బేఖాతారు

7

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- కలెక్టర్ రాజకుమారి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. నంద్యాల పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి, పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదూర ప్రాంతాలనుంచి వ్యయప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి చేరుకుంటారని, వారి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ప్రతిఒక్క అధికారిపై ఉందన్నారు. ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ వారికి అర్థమయ్యే విధంగా స్పష్టంగా ఉండాలని సూచించారు.

మాస్టర్ వీవర్స్‌కు.. చేయూత ఏదీ?

- చేనేత కార్మికులకు ఉపాధి కల్పనలో కీలకం
- నిర్వీర్యమవుతున్న సహకార సంఘాలు
- అండగా నిలుస్తున్న మాస్టర్ వీవర్స్
- ప్రభుత్వ గుర్తింపు కోసం తాపత్రయం
- గుర్తింపు కార్డులు, రుణ సౌకర్యం కల్పించాలని విన్నపం
- 14 నెలలైనా అమలు కాని హామీ

కర్నూలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో చేనేత రంగానికి వందేళ్ల చరిత్ర ఉంది. 1938లోనే 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్ దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించారు. ఎమ్మిగ నూరు, కోడు మూరు, ఆదోని, నంద వరం, నాగులదిన్నె, గుడేకల్లు, గూడూరు, నంద్యాల, కోవెలకుంట్ల, బనగానపల్లె, నందికొట్కూరు, వెలుగోడు, ఆత్మకూరు ప్రాంతాల్లో చేనేత మగ్గాలపై వస్త్రాలు ఉత్పత్తి చేస్తూ చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. చేనేత మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న చేనేత కుటుంబాలు 15-20 వేలు వరకు ఉన్నాయని అంచనా. పాలకుల నిర్లక్ష్యం.. ప్రభుత్వాలు చేయూత కరువై.. మరమగ్గాల పోటీ తట్టుకోలేక నమ్ముకున్న మగ్గాన్ని వదిలేసి వలసలు వెళ్లిన వారెందరో. అంతేకాదు.. ఒకనాడు వేలాది మందికి ఉపాధి కల్పించిన సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో ఆ సంఘాలు నిర్వీర్యమయ్యాయి. ఫలితంగా మగ్గం వదిలేసి.. ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటున్న సమయంలో మేమున్నామంటూ చేనేతలకు మాస్టర్ వీవర్స్ అండగా నిలిచారు. పాతికేళ్లకు పైగా జరీ అంచు పట్టుచీరల తయారీలో నైపుణ్యం చాటుతూ మగువ మనసును దోచే పట్టుచీరల ఉత్పత్తిలో మాస్టర్ వీవర్స్ పాత్ర కీలకంగా మారింది.



చేనేత మగ్గంపై జరీ అంచు పట్టుచీరల నేత పనిలో చేనేత కార్మికులు

ఒక్కో మాస్టర్ వీవర్ 25 నుంచి వందకు పైగా..

ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, నందవరం ప్రాంతాల్లో దాదాపు 125 మం దికిపైగా మాస్టర్ వీవర్స్ ఉన్నారు. ఒక్కో మాస్టర్ వీవర్ 25 నుంచి వందకు పైగా చేనేత మగ్గాలు కలిగి దాదాపు 5-6వేల మంది చేనేత కుటుంబాలకు ఉపాధి చూపుతున్నారు. మగ్గంపై పరోక్షంగా ఆధారపడిన డైయింగ్ (రంగులు) వేసే, పాగడ అతికే కార్మికులు, జరీ పాగడాలు వేసే వారు. ఇలా ఉపవృత్తి పొందుతున్న చేనేత కార్మికులు సరేసరి. మగువలు మెచ్చే డిజైన్లు తయారీ, మగ్గం, ముడి సరుకు సరఫరా మొదలు ఉత్పత్తి చేసిన జరీఅంచు పట్టు చీరలు విక్రయాలు బాధ్యత మాస్టర్ వీవర్స్‌దే. చీరలు అమ్ముడుపోయినా పోకపోయినా నేత కార్మికుడికి మాత్రం చీర నేసిన కూలీ డబ్బులు ఇవ్వాల్సిందే. మగ్గంపై చీర నేస్తే డిజైన్‌ను బట్టి ఒక్కో చీరకు కనిష్టంగా రూ.2,500, గరిష్టంగా రూ.6,500-7,000 వరకు చేనేతలకు కూలి చెల్లిస్తారు. ఒక చీర నేయడానికి భార్యాభర్త కష్టపడితే 5-10 రోజులు సమయం పడుతుంది. మాస్టర్ వీవర్స్ తాము బతుకుతూ వేలాది మంది చేనేత కార్మికులకు బతుకునిస్తున్నారు. అన్‌సీజన్‌లో చీరలు అమ్ముడుపోక, వ్యాపారులు మోసా లకు గురై తీవ్రంగా నష్టపోయిన మాస్టర్ వీవర్స్ ఎందరో ఉన్నారు. అయినా.. మరో వృత్తి తెలియక దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో

ఫొటో.. మధుర జ్ఞాపకం



ఫొటో.. రెండక్షరాల ఈ పదం ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండిపోయేలా చేస్తుంది. ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతుంటే పాత ఫొటో ఒకటి చూస్తే చాలు కాలం వెనక్కు వెళ్లి ఏళ్లనాటి మధురస్మృతులు మనసులో మెదలుతాయి. ఒక్కమాట వేల మందిని ప్రశ్నిస్తుంది. కానీ ఒక చిత్రం కోట్ల మంది ఆలోచనను మారుస్తుంది. ప్రతి ఒక్కరిలోనూ స్పందన కలిగిస్తుంది. వెయ్యి పదాల్లో చెప్పలేని భావం ఒక ఫొటో చెబుతుంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

- వివరాలు 6లో...



నీలి హంద్రీ

సోమవారం సాయంత్రం ఆకాశం నీలిరంగులో దర్శనమిచ్చింది. దీంతో కర్నూలు నగరం నడిబొడ్డున ప్రవహిస్తున్న హంద్రీనది సైతం నీలిరంగులో తన రూపాన్ని మార్చుకుని కాసేపు ఇలా కనువిందు చేసింది.
- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

ఫొటో.. మధురజ్ఞాపకం

- గత స్మృతులకు ఆనవాలు ఫొటోలు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కర్నూలు కల్చరల్/ ఆత్మకూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఫొటో.. రెండక్షరాల ఈ పదం ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండిపోయేలా చేస్తుంది. వెయ్యి మాటలు చెప్పలేని భావాన్ని ఒక ఫొటో చెబుతుంది. వర్తమాన అంశాలను భవిష్యత్ తరాలకు అందిస్తుంది. మధుర జ్ఞాపకాలని తరతరాలకు భద్రపరుస్తుంది. పండుగలు, వివాహాలు, వేడుకలు, విహారాలు, విషాదాలు, సాహసాలు.. అన్నింటికీ ఫొటో సాక్ష్యంగా నిలుస్తుంది. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం.. ఓ కథ.. ఓ అనుభూతి దాగి ఉంటుంది. అలనాటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ తనివితీరా వీక్షించుకునే అవకాశాన్ని ఇచ్చేవి ఫొటోలు మాత్రమే. అందుకే ప్రస్తుత దైనందిన జీవితంలో ఫొటోగ్రఫీ ఒక భాగంగా మారింది. ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం గిర్రున తిరుగుతుంటే పాత ఫొటో ఒకటి చూస్తే చాలు కాలం వెనక్కు వెళ్లి ఏళ్లనాటి మధురస్మృతులు మనసులో మెదలుతాయి. కెమెరా కంటితో చూసిన ఒక అందమైన దృశ్యాలకు శాశ్వత రూపాన్ని తీసుకువచ్చే కళాకారులే ఛాయా చిత్రకారులు. పువ్వుల్నీ, పసిపాపల నవ్వుల్నీ, జడివాన చినుకుల్ని, జలపాతాల ఒరవడిని ఇలా హృదయాన్ని స్పందింపజేసే ఏదైనా సరే.. చిత్రంగా ఆవిష్కరించాలని పరితపించే కళాకారుడే ఫొటోగ్రాఫర్. ఇంతటి తియ్యని గుర్తుల ముద్రలు వేసే ఫొటోగ్రఫీ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఓ ముఖ్యమైన రోజు ఉంది. ఫొటోగ్రఫీ పితామహుడు విలియం హెన్రీఫాక్స్ సేవలకు గుర్తుగా ప్రతి ఏటా ఆగస్టు 19వ తేదీన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తున్నాయి.



సెల్ఫీతో కొత్త పుంతలు

దశాబ్దాలుగా ఫొటోలు తీయడం ఎన్నో దశలను దాటుతూ వస్తోంది. ఫొటోగ్రఫీకి ప్రధానంగా కావాల్సింది సృజనాత్మకత. అలాగే కెమెరా కన్ను ఉండాలి. మార్పులు ఎన్ని వచ్చినా జీవితంలో ఫొటోతో విడదీయలేని బంధమే. స్మార్ట్ ఫోన్లు వచ్చాక ఫొటోగ్రఫీ మరీ తేలిక అయిపోయింది. ఇక సెల్ఫీ ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. కొన్ని సందర్భాల్లో సెల్ఫీల విపరీత పోకడలతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో ఫొటోల పిచ్చిపేరుతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. రైలు వెళ్తుండగా సెల్ఫీ తీస్తూ, ఉధృతంగా ప్రవహిస్తున్న నదీతీరంలో ఫొటోలు తీయడం, బైక్‌లపై విన్యాసాలు చేస్తూ సెల్ఫీలు తీసుకునే క్రమంలో యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో తమ ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. సెల్ఫీ పిచ్చి పేరుతో ప్రాణాలపై తెచ్చుకుని తల్లిదండ్రులకు శోకాన్ని మిగుల్చుతున్నారు. ఫొటో ఫ్యాషన్ కావాలే కానీ.. ప్రాణాలు తీసుకునేలా ఉండకూడదని ఫొటోగ్రాఫర్లు హెచ్చరిస్తున్నారు.



13 ఏళ్లుగా సామాజిక సేవలో...

ఎస్కే బాషా, కల్లూరు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల ద్వారా తాము ఉపాధి పొందడమే కాదు, కొందరు సామాజిక సేవల్లోనూ ముందుంటున్నారు. మేము గత 12 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తొలుత పేద ఫొటోగ్రాఫర్ల సహాయార్థంగా చేపట్టిన ఈ సామాజిక సేవా కార్యక్రమాలు ఇతరులకూ విస్తరించాం. సంఘ సభ్యులంతా సంపాదించిన సొమ్ములో 30శాతం సామాజిక సేవలకు వినియోగించాలనేది మా అభిమతం. అలా 2012 నుంచి సేవలు కొనసాగిస్తున్నాం.



ట్రైసైకిల్, ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రస్తుతం 62 మందికి ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లను అందిస్తున్నాం. వికలాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్నాం.

ఆందోళనలో అన్నదాతలు

- జిల్లాలో వారం నుంచి ఎడతెరిపిలేని వానలు
- నీటి నిల్వతో తెగుళ్ల బారిన పంటలు



వర్షం నీటిలో ఉన్న పైర్లు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. వర్షం కోసం ఎదురు చూసినప్పుడు చినుకే లేక కన్నీరు మున్నీరైన రైతులు ప్రస్తుతం ఎడతెరిపి లేని వర్షాలతో పంటలు చేతికి అందుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కళ్ల ముందే పైర్లు నీటిలో మునిగిపోతుంటే.. ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. వారం రోజులుగా పైర్లు నీటిలోనే ఉండటంతో వాటికి క్రిమికీటకాలు, తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. వాటి నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉండిపోతున్నారు. ఎలాగైనా పొలాల్లోని నీటిని బయటకు తోడేయకుంటే రైతులకు నష్టం తప్పదని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆగస్టు 25 నాటికి 52.5 మి.మీ. వర్షం మాత్రమే కురవాల్సి ఉండగా.. దాదాపు మూడు రెట్లు ఆగస్టు 18నాటికే కురవడంతో పొలాలన్నీ నీటిమయమైపోయాయి. సోమవారం నాటికి జిల్లాలో 140.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజుల పాటు ఇదే స్థాయిలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. పైర్లను కాపాడుకునేందుకు రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని జేడీ వరలక్ష్మి తెలిపారు. సోమవారం ఓర్వకల్లులో 24.4 మి.మీ., ఎమ్మిగనూరులో 21.8, కౌతాళంలో 12.8, గోనెగండ్లలో 11.2, మంత్రాలయంలో 10.6, కోడుమూరులో 10.2, గూడూరులో 10, దేవనకొండలో 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఫిలాటలీ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఫిలాటలీ(స్టాంపుల సేకరణపై అవగాహన) స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరిటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పించడానికి ఎన్నో రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ద్వారా స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. వీరందరూ గడిచిన విద్యా సంవత్సరం 2024-25లో 60 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మార్కులలో 5 శాతం రాయితీ ఉంటుందని సూచించారు. ఈ పరీక్ష రెండు విభాగాలుగా ఉంటుందని, ఉత్తీర్ణత పొంది విజయం సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వ్యక్తిగతంగా, పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా ఫిలాటలీ డిపాజిట్ అకౌంట్‌ను రూ.200తో ప్రధాన తపాలా కార్యాలయంలో తెరిచి ఆ వివరాలను దరఖాస్తులకు జతపరచి ఒక కవరులో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, కర్నూలు డివిజన్, కర్నూలు-518001కు పంపాలని కోరారు. కవరుకు ఫిలాటలీ స్టాంప్‌ను అతికించి స్పీడ్ పోస్టు ద్వారా మాత్రమే పంపాలన్నారు. ఒక కవరులో ఒకే దరఖాస్తు ఉండాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 19లోపు చేరవేయాలని, అదే నెలలోనే పరీక్ష ఉంటుందని చెప్పారు. మరిన్ని వివరాలకు ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మాస్టర్ వీవర్స్‌కు చేయూత ఏదీ?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేసి సంక్షేమ పథకాలు అందిస్తుంది. మాస్టర్ వీవర్స్‌ను చేనేత కార్మికులుగా గుర్తించడం లేదు. డైయింగ్ కార్మికులు, వార్పు, పాగడాలు వేయడం, అతికే కార్మికులను కూడా గుర్తించపోవడంతో ప్రభుత్వ పథకాలు వారికి అందని ద్రాక్షగా మారాయి. చేనేత నైపుణ్యం ఉన్నా సరైన ప్రోత్సాహం లేక ఇబ్బందులు పడుతున్నారు. మమ్ములను చేనేతలుగా గుర్తించండి.. ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలని విన్నపాలు బుట్టదాకాలు అవుతున్నాయి. గత ఎన్నికల ముందు ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల్లో మాస్టర్స్ వీవర్స్‌కు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. మంగళగిరి తరహాలో చేనేతలతో పాటుగా మాస్టర్ వీవర్స్ చేయూత అందిస్తామని టీడీపీ స్పష్టమైన హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.



మగువ మనుసు దోచే డిజైన్లలో చేనేత పట్టుచీరలు

ప్రధాన డిమాండ్లు ఇవే

- మాస్టర్ వీవర్స్‌ను ప్రభుత్వం గుర్తించాలి. చేనేత జౌళి శాఖ ద్వారా గుర్తింపు కార్డులు జారీచేయాలి. అన్‌సీజన్ సమయంలో పట్టుచీరలు అమ్ముడుపోక నిల్వలు పేరుకుపోతున్నాయి. నేతన్నకు ఉపాధి చూపాలంటే అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. పావులావడ్డీకి స్వల్పకాలిక, దీర్ఘకాలిక బ్యాంక్ రుణాలు ఇచ్చి ఆర్థిక భరోసా ఇవ్వాలి. పట్టు (సిల్క్), రంగులు కొనుగోళ్లపై రాయితీ ఇవ్వాలి.
- మాస్టర్ వీవర్స్ ఉత్పత్తి చేసే చేనేత పట్టుచీరలు, ఇతర వస్త్రాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలి. సహకార సంఘాలతో సంబంధం లేకుండా పారిశ్రామికవేత్తల తరహాలో మాస్టర్ వీవర్స్‌కు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి.

మాకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మాస్టర్ వీవర్‌గా మరో 30-40 మంది చేనేతలకు ఉపాధి కల్పిస్తున్నాం. మార్కెట్ పోటీని తట్టుకోవాలంటే ఆకట్టుకునే డిజైన్లు ఎంతో ముఖ్యం. చీరలు అమ్ముడుపోయినా పోక పోయినా నేత నేసిన నేతన్నకు కూలీ డబ్బులు ఇవ్వాల్సిందే. లేదంటే వారి కుటుంబ పోషణ కష్టంగా మారుతుంది. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని రాణిస్తున్న మాస్టర్ వీవర్స్‌కు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలి.

● సి. చిన్న రంగస్వామి, మాస్టర్ వీవర్, ఎమ్మిగనూరు

రాయితీపై పట్టు సరఫరా చేయాలి



మా తాతల కాలం నుంచి చేనేత వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. మాస్టర్ వీవర్‌గా 35ఏళ్ల నుంచి నేను ఉపాధి పొందుతూ మరో 35మంది చేనేతలకు ఉపాధి కల్పిస్తున్నా. ప్రభుత్వం ప్రోత్రాహం, గుర్తింపు ఇవ్వాలి. పట్టుచీరల తయారికి కీలకమైన పట్టు (సిల్క్), రంగులపై ప్రభుత్వం రాయితీలు ఇచ్చి మాస్టర్ వీవర్స్‌ను కూడా ఆదుకోవాలి.

● ఎం. రాఘవేంద్ర, మాస్టర్ వీవర్, కోడుమూరు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



జిల్లాలో మాస్టర్ వీవర్స్ గుర్తింపు కార్డులివ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వడానికి అవకాశం లేదు. మాస్టర్ వీవర్స్‌కు గుర్తింపు కార్డులు జారీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. సహకార సంఘంగా ఏర్పడితే వారికి నూలు, సిల్క్‌పై 15 శాతం రాయితీ, 8 శాతం త్రిఫ్ట్ ఫండ్ వస్తుంది. ముద్ర రుణాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. చేనేత వస్త్ర ఉత్పత్తిదారుడిగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) నుంచి నూలు, సిల్క్ తీసుకునే అవకాశం ఉంది. దీనిపై మాస్టర్ వీవర్స్‌కు అవగాహన కల్పిస్తాం.

● నాగరాజరావు, ఏడీ, చేనేత, జౌళి శాఖ, కర్నూలు

నాణ్యమైన ఆహారం అందించాలి

- కలెక్టర్ రాజకుమారి



ఎగ్ కార్ట్‌లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ హాల్ వద్ద డ్వాక్రా మహిళలు ఇదాయతున్, కళ్యాణికి కలెక్టర్ ఎగ్ కార్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం డీఆర్‌డీఏ, వెలుగు శాఖల ద్వారా స్వయం సహాయ సంఘాలకు ఎగ్ కార్ట్‌లను అందిస్తుందన్నారు. జిల్లాకు 100 కార్ట్‌లు అందజేయల్సి ఉండగా అర్హత కలిగినవారికి 40 ఎగ్ కార్ట్‌లను ఉచితంగా ఇచ్చారు. ఒక్కొక్క ఎగ్ కార్ట్ రూ.50వేల విలువ చేస్తుందన్నారు. డ్వాక్రా మహిళల్లో తోపుడు బండ్లమీద బజ్జీలు, పకోడీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారో వారిని గుర్తించి ఎగ్ కార్ట్‌లను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అందులో తప్పకుండా ఎగ్ వెరైటీ ఫుడ్స్ చేయాలని సూచించారు.

నిరుద్యోగులకు అండగా నిలవాలి

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



ఆర్థిక మంత్రితో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకాన్ని చిన్న జిల్లాలకు కూడా వర్తింపజేసి నిరుద్యోగులకు అండగా నిలవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. సోమవారం ఢిల్లీలో పార్లమెంట్‌లో ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద నంద్యాల జిల్లాకు 372 దరఖాస్తులకు అనుమతివ్వగా ఇంతవరకు 3000 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 30 మందికి మాత్రమే ఉద్యోగ అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవ కాశం కల్పించే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌నుఎంపీ బైరెడ్డి శబరి పార్లమెంట్ ప్రాంగణంలోని మంత్రి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి కావాల్సిన ఆర్థిక తోడ్పాటును కల్పించాలని కోరినట్లు ఎంపీ తెలిపారు. కేంద్రమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు హోంశాఖ మంత్రి అభినందనలు



చంద్రశేఖర్

మహానంది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కారులో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ చిన్నారిని కాపాడిన కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత సామాజిక మాధ్యమంలో అభినందనలు తెలిపారు. మహానంది పోలీస్‌స్టేషన్‌కు చెందిన చంద్రశేఖర్ ఆదివారం ఆలయ పరిసరాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన ఓ కుటుంబం మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చారు. ఏడాది వయస్సున్న చిన్నారిని కారులో ఉంచి కారుకు తాళం వేసి దర్శనం కోసం ఆలయానికి వెళ్లారు. కారులో ఉన్న చిన్నారి ఊపిరాడక, చెమటలు పట్టి గుక్కపట్టి ఏడుస్తుండటాన్ని స్థానికులతో పాటు ఆలయ ఉద్యోగి ఈశ్వర్ గమనించారు. వెంటనే కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు విషయం తెలిపారు. ఆయన ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డికి సమాచారం అందించి కారు అద్దాలు పగల కొట్టి చిన్నారిని రక్షించారు. విషయం తెలుసుకున్న హోం మంత్రి అనిత కానిస్టేబుల్‌కు అభినందనలు తెలిపారు.

వైభవం.. సిద్ధేశ్వరస్వామి రథోత్సవం



ఆలూరులో సిద్ధేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలిసిన సిద్ధేశ్వరస్వామి రథోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలూరు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. వీరశైవ లింగాయతీ వర్గానికి చెందిన భక్తులు ప్రత్యేక పూలదండను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ మహబూబ్‌బాషా, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మహానందిలో దోపిడీ పర్వం

- అన్నదానం నుంచి.. ఉచిత మరుగుదొడ్ల వరకు ఆగని దందా
- చక్రం తిప్పుతున్న ఇద్దరు అధికారులు
- అడ్డదారిలో జీతాలు డ్రా
- మంత్రి ఆదేశాలు బేఖాతరు



భక్తులకు ఉచిత అన్నదానం (ఫైల్)

నంద్యాల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): మహానంది పుణ్యక్షేత్రంలో దోపిడీ పర్వం కొనసాగుతోంది. కొంత కాలంగా పలు రకాల అవినీతి, అక్రమాలు సాగుతున్నాయని ప్రచారం జోరందుకుంది. ఉచిత అన్నదానం నుంచి మరుగుదొడ్ల వరకు ఎక్కడ పడితే అక్కడ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా ఏకంగా అడ్డదారిలో ఉద్యో గుల పేరుతో జీతాలు డ్రా చేసి క్యాష్ చేసుకుంటున్నారని వినికిడి. ఇటీవల ఆశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి మహానందిలో పర్యటించగా ఉచిత మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని ఆదేశించారు. రెండు మూడు రోజులు నిర్వహించి తర్వాత షరా మాములే.. భక్తులను నిత్యం దోపిడీ చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో సదరు ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారుల పాత్ర ఎక్కువగా ఉందని ఆ వర్గాల నుంచి తెలుస్తోంది. ఏది ఏమైన పవిత్ర పుణ్యక్షేత్రమైన మహానంది క్షేత్రంలో పలు రూపాల్లో అవినీతి అక్రమాలు జరుగు తుండటం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ మంత్రి అదేశాలనే బేఖేతారు చేయడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా మహానందికి విచ్చేస్తున్న ఆశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ సైతం సదరు అక్రమాలపై దృష్టిసారిస్తారా? లేదా సందేహాలు లేక పోలేదు. ఏది ఏమైనా పలు రూపాల్లో భక్తులతో పాటు అన్నదానం రూపంలో దోపిడీకి తెర లే పడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



ఉచిత మరుగుదొడ్ల బోర్డు ఇలా..

అన్నదానం అడపాదడపాగా నిర్వహించి

మహానంది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం దేవాదాయ శాఖ ఉచిత అన్నదానం సదుపాయం అమలు చేస్తోంది. ఈనేపథ్యంలో ప్రతి రోజు 500 మంది భక్తుల వరకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. అయితే క్షేత్రం సమీపంలో ఉండే హోటళ్ల నిర్వాహకులతో కుమ్మక్కై ఉచిత అన్నదానం అడపాదడపాగా నిర్వహించి మమ అన్పించేస్తున్నారని సమాచారం.

అడ్డదారిలో జీతాలు డ్రా....

పుణ్యక్షేత్రం పలు పనుల కోసం ఓ ఏజెన్సీ ద్వారా ఉద్యోగులను తీసుకుని పనులు చేయిస్తుండటం జరుగుతోంది. గతంలో మరుగుదొడ్ల టెండర్లు దక్కించుకుని రూ.లక్షలు ఎగ్గొట్టిన టెండరుదారుల సమీప బంధువులను(ఇద్దరు మహిళలు) ఏజెన్సీ తరుపున ఉద్యోగంలో చేర్పించారు. వారు విధులకు రాక పోయిన నెలనెల జీతాలు డ్రా చేస్తున్నారు.

అవినీతి, అక్రమాలకు బరితెగించారనే..

అవినీతిలో ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారుల పాత్ర కీలకంగా ఉందని సమాచారం. ఆఇద్దరు అధికారుల్లో ఒకరు రూ.లక్షలు వెచ్చించి ఇక్కడ పోస్టింగ్ పొందారనే విమర్శలు లేకపోలేదు. తద్వారా ఇష్టారాజ్యంగా మహానందీ ఆలయంలో అవినీతి అక్రమాలకు బరితెగించారనే ఆరోపణలు లేకపోలేదు.

పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే..

మహానంది క్షేత్రంలో జరిగే అవినీతి అక్రమాలపై పట్టించుకునే నాథుడే కరువయ్యారనే ఆరోపణలు లేకపోలేదు. దేవాదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ మంగళవారం మహానంది పుణ్య క్షేత్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఈయనైనా ఈ వ్యవహారాలపై దృష్టిసారిస్తారా..? లేది అనే సందేహాలు భక్తుల్లో లేకపోలేదు.

భళా.. ఎల్ల లింగ



220 కేజీల ఇసుక బస్తాను ఎత్తుతున్న మడినల్ ఎల్ల లింగ



175 కేజీల గుండు ఎత్తుతున్న కప్పగల్ కర్ణ

- 220 కేజీల ఇసుక బస్తా ఎత్తిన యువకుడు
- 175 కేజీల రాతి గుండు ఎత్తిన కప్పగల్ కర్ణ
- కందుకూరులో బలప్రదర్శన పోటీలు

కోసిగి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఏపీతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన గ్రామీణ యువకులు పాల్గొన్నారు. 220 కేజీల ఇసుక బస్తా ఎత్తే పోటీలో కర్ణాటక చెందిన మడినల్ ఎల్ల లింగా అనే యువకుడు ఇసుక బస్తాను ఎత్తి విజేతగా నిలిచారు. అలాగే మరియప్ప నాయక్ అనే యువకుడు 200 కేజీల ఇసుక బస్తాను ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. 175 కేజీల రాతిగుండును కర్ణాటకకు చెందిన కప్పగల్ కర్ణ అనే యువకుడు ఎత్తి శభాష్ అనిపించుకున్నాడు. ఏడు కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఈరన్న అనే యువకుడు మొదటి స్థానంలో నిలిచాడు. పెద్దతుంబళం గ్రామానికి చెందిన తిమ్మప్ప రెండో స్థానంలో నిలిచాడు. వీరికి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. బల ప్రదర్శనలు తిలకించేందుకు వేలాది మంది ప్రజలు చూడడానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ముత్తురెడ్డి, రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, చిన్న తాయన్న, నర్సారెడ్డి, తోవి రామకృష్ణ, జ్ఞానేష్, గాలెం వీరేష్ రామిరెడ్డి, కురువ అయ్యన్న, రామలింగ, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో పోటీలను తిలకిస్తున్న టీడీపీ నాయకులు

యువతి బలవన్మరణం

గడివేముల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పెసరవాయి గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన గాయత్రి(30) నల్గొండ జిల్లాలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేస్తోంది. ఐదేళలగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మానసికంగా కుంగిపోయింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఎస్ నగర్‌లోని లలిత్ కుమార్ (19) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. ఎంఎస్ నగర్‌కు చెందిన లలిత్‌కుమార్ కారు మెకానిక్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిస కావడంతో తండ్రి ఈరన్న మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన లలిత్ కుమార్ సోమవారం ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దొంగల ముఠా అరెస్టు

- ఆరుగురి నుంచి రూ.2.10 లక్షల నగదు, 15 లీటర్ల సారా, భారీగా కాపర్ కేబుల్ స్వాధీనం



నిందితులను చూపుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమ రైల్వే లైన్ కేబుల్ చోరీకి పాల్పడిన ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఈ మేరకు నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టారు. మీర్జాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు, పిక్కిలి రామచంద్రుడు, పిక్కిలి వెంకటసుబ్బయ్య, వెంకటనరసింహనాయుడు, కళ్యాణ్‌కుమార్ తో ఓ బాలుడిని గ్రామంలోని సుంకులమ్మగుడి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.2.10 లక్షలు నగదు, 15 లీటర్లు సారా, పెద్ద ఎత్తున రైల్వే లైన్ కాపర్ కేబుల్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు. ఈకేసులో మరికొంత మంది నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. ఎస్ఐ గోపాల్, పోలీసులు శేషు, గోపాల కృష్ణ పాల్గొన్నారు.

వైద్యులే అన్నీ తామై..

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రాణపాయస్థితిలో వచ్చిన ఓ రోగికి నా అనే వారు ఎవరూ లేకపోయినా వైద్యులే అన్నీ తామై వ్యవహరించి ప్రాణాలు కాపాడారు. రోగికి ఆపరేషన్ చేసేందుకు కుటుంబ సభ్యులు అనుమతి, సంతకాలు చేయాలన్నా నిబంధనలు ఉన్నప్పటికీ ఆ రోగికి సంబంధించిన వారు లేకపోవడంతో వైద్యులు సాహసంతో ప్రాణాన్ని కాపాడేందుకు బంధువుల అనుమతి లేకుండానే ఆపరేషన్ చేశారు. కర్నూలు కొత్తబస్టాండు సమీపంలో నిర్మల హోటల్‌లో ఒంగోలుకు చెందిన రవి అనే వ్యక్తి పని చేస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. రోగిని 108లో హుటాహుటిన తీసుకువచ్చారు. సర్జరీ వైద్యులు పరీక్షలు నిర్వహించగా.. రోగి కడుపుకు తీవ్రగాయమైనట్లు, ప్లీహం దెబ్బతిన్నట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని జనరల్ సర్జరీ మొదటి యూనిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ అహ్మద్.. సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ హరిచరణ్‌కు కేసు పరిస్థితిని వివరించారు. రోగి ప్లీహం తొలగించాలని, లేకుంటే రోగి బతికే పరిస్థితి లేదని తేల్చారు. ప్లీహం తొలగించాలంటే బంధువుల అంగీకారం ఉండాలి. ఆ సమయంలో బంధువులు ఎవరూ లేకపోవడంతో సర్జరీ హెచ్‌వోడీ హరిచరణ్ సూచనల మేరకు కేసు వివరాలను సీఎస్ఆర్ఎంవో వెంకటరమణకు వివరించారు. సీఎస్ఆర్ ఎంవో కూడా రోగి ప్రాణాన్ని కాపాడాటం ముఖ్యమని వెంటనే ప్లీహం తొలగించాలని సూచించడంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్దుల్ అహద్ రోగికి సోమవారం తెల్లవారుజామున ఆపరేషన్ చేసి ప్రాణాన్ని కాపాడారు. ప్రస్తుతం రోగిని సర్జరీ ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

దంపతుల ప్రాణాలు కాపాడారు

- ఎస్సార్బీసీ కాలువలో దూకడానికి భార్యాభర్తల నిర్ణయం
- రక్షించిన పోలీసులు



ఎస్సార్బీసీ వద్ద దంపతులను రక్షించిన ఎస్ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక బనగానపల్లె పట్టణ సమీపంలోని ఎస్సార్బీసీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని భావించిన దంపతులను బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది కాపాడిన ఘటన సోమవారం జరిగింది. వివరాలివీ.. కడప జిల్లా మైదుకూరు సమీపంలోని జంగంపల్లె గ్రామానికి చెందిన మద్దిలేటి, శశికళ దంపతులు అవుకు మండలంలోని రామాపురం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే అప్పులు అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండ సమీపంలోని ఎస్సార్బీసీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని భావించారు. కాలువలో దూకే ముందు శశికళ తన సమీప బంధువు చిన్నమద్దిలేటికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో ఆయన వెంటనే బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ చేసి తన అన్న, వదిన ఆత్మహత్య చేసుకో బోతున్నారని సీఐ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ దుగ్గిరెడ్డిని, పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సహకారంతో లోకేషన్ ద్వారా బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది నాగచంద్రుడు, రమణయ్య బనగానపల్లె పట్టణ సమీపంలోని రవ్వలకొండ వెళ్లే మార్గంలోని ఎస్సార్బీసీ కాలువ వంతెనపై దంపతులు ఉన్నట్లు గుర్తించారు. అక్కడి వెళ్లి దంపతులను బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ వద్దకు తీసుకు వచ్చి విచారించారు. తమకు రూ.3 లక్షల అప్పు ఉందని, ఆ అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు దంపతులు తెలిపారు. దంపతులిద్దరికీ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డిని, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, డోన్ డీఎస్పీ శ్రీనివాస్ అభినందించారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

కర్నూలు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేసన్ పరిధిలో ఆర్టీసీ బస్టాండులో చోరీ చేసిన ఇద్దరు నిందితురాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు నగరం వడ్డెగేరికి చెందిన షేక్ ఖాజాబి, షేక్ ఫరీదాబీను అరెస్టు చేసి వారి నుంచి 4 తులాల బంగారు గొలుసు రికవరీ చేసినట్లు సీఐ విక్రమసింహ తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలానికి చెందిన విమలమ్మ అనే వృద్ధురాలు ఈ నెల 13వ తేదీన కర్నూలు వచ్చారు. కొత్తబస్టాండులో ఆత్మకూరు వెళ్లేందుకు బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తుండగా.. ఆమె చేతిబ్యాగులో ఉన్న పర్సు చోరీకి గురైంది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాళ్లను గుర్తించారు. వీరి వద్ద నుంచి బంగారు గొలుసును రికవరి చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.



నిందితులను చూపుతున్న పోలీసులు

జీవో 23ని రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పర్యాటక అభివృద్ధి సంస్థలోని 22 హోటళ్లను ప్రైవేట్‌పరం చేయాలని తీసుకువచ్చిన జీవో నెంబరు 23ని రద్దు చేయాలని ఏపీ టూరిజమ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. జీవోకు వ్యతిరేకంగా సోమవారం వెంకటరమణ కాలనీ హరిత హోటల్ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ గత రెండున్నర దశాబ్దాలుగా పని చేస్తున్న ఉద్యోగ భద్రత లేదన్నారు. ఉద్యోగులకు క్రమబద్ధీకరించకుండా హోటళ్లను ప్రైవే టుకు దారాధత్తం చేయడం సరికాదన్నారు. హోటళ్లను ఆధునిక వసతుల కల్పన పేరుతో రూ.159 కోట్లు బ్యాంకుల ద్వా రా రుణం తీసుకుని వాటి మరమ్మతులు పూర్తి చేసి ప్రైవేటుకు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో శ్రీనివాసయాదవ్, జామవా, సుధాకర్, ఆంజనేయులు, సరిత, సుగుణదేవి, జయరామ్, ఎన్.రావు, సురేష్ పాల్గొన్నారు.

కేఎంసీలో అ‘పూర్వ’ సమ్మేళనం

- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న కర్నూలు వైద్య కళాశాల విద్యార్థులు
- గురువులకు సన్మానం



2000వ బ్యాచ్‌కు చెందిన కేఎంసీ పూర్వ విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ(కర్నూలు మెడికల్ కాలేజీ)లో 2000వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మెడికల్ కాలేజీలోని న్యూ ఆడిటోరియంలో జరిగింది. సోమవారం కేఎంసీ 2000 బ్యాచ్‌కు చెందిన 150 మందిలో 80 మంది పూర్వ విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండు, దుబాయి, ఆస్ట్రేలి యాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వైద్యులు టైటాన్స్ రీయూనియన్ పేరుతో కలుసుకున్నారు.

25 ఏళ్ల అనంతరం కలుసుకుని వైద్యులు ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమ భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువులు కంటి వైద్యులు డా.పి.సుధాకర్‌రావు, సీనియర్ ఫిజిషియన్ డా.భవానీప్రసాద్, డా.గిడ్డయ్య, డా.విష్ణుప్రసాద్, పథాలజి హెచ్‌వోడీ డా.బాలేశ్వరి, కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అనంతరం కాలేజీ అంతా తిరిగారు. కార్యక్రమంలో 2000 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కార్డియాలజిస్టు డా.పి.ప్రశాంత్, డా.శివబాల, డా.జాన్ (హైదరాబాదు), డా.ఫణికిషోర్, డా.రాఘవ, డా.సుబ్బారెడ్డి(యూఎస్ఏ), డా.అర్చన్, డా.హేమలత, కార్డియాలజిస్టు డా.మహ్మద్ ఆలి వైద్యులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె

ఓర్వకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన కురువ పెద్దమల్లయ్య మట్టి మిద్దె సోమ వారం ఉదయం కుప్పకూలింది. కుటుంబ సభ్యులు బయటి వరండాలో ఉండగా.. వంట గది కుప్పకూలింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.



పాలకొలనులో కూలిన మట్టి మిద్దె

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

కాశీవిశ్వేశ్వరుడికి బాలాలయం పూజలు



బాలాలయం పూజల్లో పాల్గొన్న ఏఈవో మధు, అర్చకులు

మహానంది, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం తమ్మడపల్లిలోని కాశీవిశ్వేశ్వర స్వామికి ఆలయం పునఃప్రతిష్ఠ నిర్మాణంలో భాగంగా సోమవారం బాలాలయం పూజలు నిర్వహించారు. ముందుగా మహానంది ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు ఆధ్వర్యంలో ఆలయంలో వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహ వాచనం, అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామదేవత అనుగ్రహంతో కంకణధారణ చేశారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఉప సర్పంచ్ ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకుడు శ్యామల జనార్ధన్‌రెడ్డి, కుమ్మరి శివయ్య, ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

టెక్లా సాఫ్ట్‌వేర్‌పై అవగాహన అవసరం

పాణ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సివిల్ విభాగం ఆధ్వర్యంలో టెక్లా సాఫ్ట్‌వేర్‌పై అవగాహన అవసరమని పలువురు పేర్కొన్నారు. ఈ అంశంపై సోమవారం నిర్వహించిన సదస్సులో బీటీఆర్ కన్‌స్ట్రక్షన్ ఎండీ ఉదయశంకర్ మాట్లాడారు. ఆధునిక నిర్మాణంలో బీఐఎం పాత్ర కీలకమన్నారు. టెక్లా స్ట్రక్టర్స్‌పై హ్యాండ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడి శ్రీనివాసులు, శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి సుధీర్‌కుమార్, కన్వీనర్ శ్రీకాంత్, సివిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం

జూపాడుబంగ్లా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండ్లెం గ్రామంలో ఈనెల 19 నుంచి 23వ తేదీవరకు ప్రత్యేక ఆధార్‌నమోదు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద క్యాంపులో విద్యార్థులు, గ్రామస్థులు ఆధార్ నమోదుతో పాటు, తప్పులుంటే సరిదిద్దుకోవచ్చని ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

తూడిచర్ల గ్రామానికి చెందిన వీరముష్టి రమణయ్య దంపతులకు నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య చేతులమీదుగా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్ సీఎం రిలీఫ్‌ఫండ్ రూ. 30వేల చెక్కును అందించారు. సంపత్, శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నదిని ఎవరూ దాటొద్దు

'భవనాశి'ని పరిశీలించిన అధికారులు



భవనాశి నది ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో ఆత్మకూరు పట్టణ శివార్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నదిని సోమవారం తహసీల్దార్ రత్నరాధిక, అర్బన్ సీఐ రాము పరిశీలించారు. వరద ఉధృతి తగ్గేవరకు భవనాశి నదిని ఎవరూ దాటవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. కాగా భవనాశి ఉప్పొంగంతో ఆత్మకూరు నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వరద తగ్గుముఖం పట్టేవరకు ఆ రహదారిని ఎవరిని అనుమతించడం లేదు. ఇందుకోసం నదికి ఇరువైపులా పోలీసు, రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అలాగే సిద్దాపురం చెరువులోకి కూడా భారీగా వరదనీరు వచ్చిచేరింది. దీంతో సిద్దాపురం చెరువును కూడా అధికారులు పరిశీలించారు. దీంతో కర్నూలు - గుంటూరు రహదారి పక్కనే ఉన్న అలుగు వద్ద నుంచి చెరువులో నీరు బయటకు వస్తుండటంతో ఆ నీటి వల్ల కేజీరోడ్డున వెళ్లే వాహనాలకు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలతో వాహనాలు కొట్టుకునిపోయేందుకు వీలు లేకుండా కంచెను ఏర్పాటు చేస్తున్నారు. చెరువు పరిసర గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా సిద్దాపురం చెరువులో గరిష్ఠస్థాయిలో నీటి నిల్వలు వచ్చిచేరడంతో వద్ద టీడీపీ నాయకులు రవీంద్రబాబు, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, వెన్నాశ్రీధర్‌రెడ్డి, స్వామిరెడ్డి, ఈశ్వరరెడ్డి తదితరులు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

సోయా చిక్కుడు వర్షార్పణం

రైతుకు తీవ్ర నష్టం

భారీ వర్షాలు అన్నదాత బతుకును అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరపిలేని వానలతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. వ్యవసాయంపై ఆశ చావక అప్పు చేసి పంట సాగు చేసిన రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. గడివేముల మండలంలో సోయా చిక్కుడు వర్షార్పణం కావడంతో రైతులు భారీగా నష్టపోయారు. పరిహారం అందజేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



బూజనూరులో నీటమునిగిన సోయా చిక్కుడు

గడివేముల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట కాయ దశలో ఉండగా ప్రకృతి కోలుకోలేని దెబ్బతీసింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పొలాలు నీట మునిగి అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. గడివేముల మండలంలోని బూజనూరు, బిలకలగూడురు, పెసరవాయి, కరిమద్దెల, చిందుకూరు, గ్రంధివేముల, గడివేముల గ్రామాలలో సుమారు 10 వేల ఎకరాల్లో రైతులు సోయా చిక్కుడు సాగు చేశారు. ఖరీఫ్ ఆరంభంలోనే వర్షాలు పడటంతో పంటలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం సోయా చిక్కుడు పంట పూత, కాయ దశలో ఉంది. ఈ నేపథ్యంలో 10 రోజుల నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో సోయాచిక్కుడు పంట పూర్తిగా దెబ్బతింది. పొలాల్లో నీరు నిల్వ చేరి తేమ అధికమవడంతో ఆకులు పసుపు రంగులోకి మారాయి. వర్షపు నీటి వల్ల వేర్లు కుళ్లిపోయి మొక్కలు బలహీనపడి నేలకొరిగాయి. పూత రాలిపోయింది. దీంతో పంట దిగుబడి తగ్గి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సేద్యం, విత్తనాలు, ఎరువులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, భారీగా వర్షాలు కురుస్తుండటంతో పెట్టుబడి కూడా చేతికి రాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పంట పూర్తిగా దెబ్బతింది



రెండెకరాల్లో సోయా చిక్కుడు సాగు చేశా. ఎకరాకు రూ.25 వేల చొప్పున రూ.30 వేలు పెట్టుబడి పెట్టా. వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలి.

● వెంకటేశ్వర్లు, బిలకలగూడురు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

వర్షాల వల్ల పలు గ్రామాల్లో సోయా చిక్కుడు దెబ్బతిందని రైతులు తెలిపారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలను అందిస్తాం. రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తాం.

● పవన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

హాజీ నగర్‌లోకి వర్షపు నీరు

నందికొట్కూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చినుకు పడితే లోతట్టు కాలనీలు నీట మునుగుతున్నాయి. వర్షాలకు వరద నీరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మారుతీనగర్, హాజీనగర్‌లలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హాజీనగర్‌లోని డ్రైనేజీలు నిండడంతో ప్రధాన రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. వర్షం కురిసిన ప్రతిసారి తమ ఇళ్లలోకి నీరు చేరుతోందని, దీని వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదని వారు తెలిపారు.



పట్టణంలోని హాజీ నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

అడుగడుగునా గుంతలు.. అవస్థల్లో ప్రయాణికులు

నంద్యాల రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల నుంచి రాయమాల్పురం, మునగాల మీదుగా పోలూరు వెళ్లే రహదారి, పట్టణం నుంచి పులిమద్దికి వెళ్లే రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. అడుగడుగునా గుంతలు పడటంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. కొందరు మృతిచెందగా, మరికొందరు గాయాలతో బయటపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్లపై కనీసం తట్టెడు మట్టి కూడా వేయకపోవడంతో ఇలా ఉన్నాయని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భయం భయంగా ఉంది



నంద్యాలకు వెళ్లాలంటే ఈ గుంతల రోడ్డుపైనే వెళ్లాలి. అయితే అడుగడుగునా గుంతలుండటంతో ఎప్పుడేమి జరుగుతుందోనని భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. వర్షాకాలంలో ద్విచక్ర వాహనదారులు కిందపడుతున్నారు. వెంటనే ఉన్నతాధి కారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - నాగేంద్ర, గోరుకల్లు

చాలా సమయం పడుతోంది



నంద్యాలకు వెళ్లాలంటే దగ్గరవుతుందని, సమయం వృథా కాదని ఈ దారిన వెళ్తాం. కానీ రోడ్డు బాగలేకపోవడంతో గంటలు గంటలు పడుతోంది. ప్రమాదాలబారిన పడుతున్నాం. గుంతల రహదారి కావడంతో వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతు న్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. - మహేంద్ర, తిరుపాడు



అధ్వానంగా ఉన్న రాయమాల్పురం పాఠశాల సమీపంలోని రహదారి



కుంటను తలపిస్తున్న పోలూరు సమీపంలోని రోడ్డు



పోలూరు- మునగాల మధ్య గుంతల రోడ్డు

రైతులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

● ప్రమాణ స్వీకారం చేసిన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

గడివేముల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకా ర సంఘ కార్యాలయ ఆవరణలో సోమవారం సహ కార సంఘ చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్లుగా శివారెడ్డి, యుగంధర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్, డైరెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సహకార సంఘంలో బంగారుపై రుణాలు అందిస్తున్నారన్నారు. ఒక్కో రైతుకు రూ.20లక్షల వరకు రుణాలను ఇస్తున్నారన్నారు. అర్హులైన రైతులు సహకార సంఘంలో రుణాలు పొందవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రైతులకు సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు పంపిణీ చేసిందని తెలిపారు. ఒక్కో మండలానికి డ్రోన్ పంపిణీ చేసి డ్రోన్ నిర్వహణపై ఐదుగురికి శిక్షణ ఇస్తున్నామన్నారు.అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్ల మరమ్మతులకు నిధులు కేటాయించిందన్నారు. అనంతరం సొసైటీ చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సహకార సంఘం బలోపేతానికి పటిష్ఠ చర్యలు చేపతామన్నారు. ఎంపీడీవో వాసు దేవగుప్త, డీసీవో ఆంజనేయులు, టీడీపీ నాయకులు నరేంద్రారెడ్డి, రమణారెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ పార్వతమ్మ, మాజీ కో- ఆప్షన్ మెంబర్ ఎస్పీ రఫిక్, మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, ఈశ్వర్‌రెడ్డి, నగిరి వెంకటేశ్వర్లుయాదవ్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



గడివేములలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

రైతులకు సేవచేసి గుర్తింపు తెచ్చుకోవాలి

గోస్పాడు: సహకార సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైనవారు రైతులకు సేవలందించి గుర్తింపు తెచ్చుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. సోమవారం యాళ్లూరు సహకార సొసైటీ అధ్యక్షుడిగా గంగుల వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా జిల్లెల్ల గ్రామానికి చెందిన గొటికె నారాయణరెడ్డి, ఎం.కృష్ణాపురానికి చెందిన ముల్లా ఖాదర్ బాషా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫిరోజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రధానంగా రైతులకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శీలం భాస్కర్‌రెడ్డి, వీరసింహారెడ్డి, ఓబుళరెడ్డి, పి.చంద్రశేఖరరెడ్డి, మాజీ సర్పంచ్ జూపల్లి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి మరింత కృషి

పాణ్యం: వ్యవసాయ పరపతి సహకార సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని మద్దూరు సహకార సంఘం నూతన అధ్యక్షుడు గణపం నరేంద్ర కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మద్దూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే సంఘం డైరెక్టర్లుగా సద్దల ఈశ్వరరెడ్డి, సీహెచ్ వెంకటసుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంఘం పరిధిలోని సుబ్బరాయుని కొత్తూరు, అనుపూరు, గగ్గటూరు, తొగర్చేడు, మద్దూరు గ్రామాల పరిధిలో 1276 మంది సంఘంలో సభ్యులుగా ఉన్నారన్నారు. రైతులకు వ్యవసాయ పంట రుణాలు, మందులు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు సకాలంలో అందిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 2024- 25 సంవత్సరానికి 246 మంది రైతులకు రూ.5. 90 కోట్ల రుణాలు పంపిణీ చేశామని సీఈఓ నరసింహులు తెలిపారు. దాదాపు 78 శాతం రుణాల రికవరీ చేశామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మిలిటరీ సుబ్బారెడ్డి, మహేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఈశ్వరరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, మోహన్ రెడ్డి, సంఘం సిబ్బంది బాలయ్య, రైతులు పాల్గొన్నారు.



గోస్పాడులో మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్



పాణ్యం: ప్రమాణం చేస్తున్న నరేంద్రకుమార్ రెడ్డి

నేతాజీకి ఘన నివాళి



పాణ్యంలో నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పాణ్యం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటంలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పరీదా, నరేష్, భాస్కర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

పగిడ్యాలలో 36.8 మి.మీ. వర్షపాతం

పగిడ్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి మండల పరిధిలోని గ్రామాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి ఉదయం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట, పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. మండల వ్యాప్తంగా 36.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎడతెరపిలేని వర్షం కురిసింది. 36.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

అవార్డుకు ఎంపికైన వారికి సన్మానం



సన్మానం పొందిన ఉద్యోగులు

జూపాడుబంగ్లా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు సందర్భంగా ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైన తహసీల్దార్ చంద్రశేఖరనాయక్, ఏఎస్‌వో హనుమంతు, సీనియర్ సహాయకురాలు సరళ, వీఆర్వో బాలకృష్ణకు సోమవారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సత్యదీప్, నాగన్నలతో పాటు వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ మండల నాయకులు దేవసహాయం, లక్ష్మన్నగౌడు వారిని సత్కరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

పగిడ్యాల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి నెహ్రూనగర్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మహిళలు సోమవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, ఫరూక్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం బస్సులో ప్రయాణిస్తున్న వారికి జాకెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సొసైటీ డైరెక్టరు గంగన్న, టీడీపీ నాయకులు రామస్వామి, శ్రీనివాసులు, గోవిందు, బక్కన్న, వెంటేశ్వర్లు, పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు.

భూములను ధ్వంసం చేస్తే ఊరుకోం: సీపీఐ

జూపాడుబంగ్లా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో భూములను ధ్వంసం చేస్తే ఊరుకోబోమని సీపీఐ నాయకులు హెచ్చరించారు. విత్తనోత్పత్తి క్షేత్రం ప్రజాభిప్రాయాలు సేకరించకుండా కెమికల్ ఫ్యాక్టరీ నిర్మించతలబెట్టారని, ఏ ఉద్దేశ్యంతో నిర్మిస్తున్నారో అధికారులు బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

దుండగులను అరెస్టు చేయాలి

జూపాడుబంగ్లా, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో దళిత ఉపాధ్యాయురాలిపై పెట్రోల్‌పోసి నిప్పంటించిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కర్ల డిమాండు చేశారు. దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని, లేకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

నారా లోకేశ్‌తో ఎంపీ భేటీ



నారా లోకేశ్‌ను సత్కరిస్తున్న ఎంపీ, కేంద్ర మంత్రులు

నంద్యాల రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సోమవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అశ్వినీ వైష్ణవ్, నితిన్‌గడ్కరీ, హర్దీప్‌సింగ్, సోనావాల్, పీయూష్ గోయల్, జైశంకర్‌లతో భేటీ అయిన అనంతరం ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో ఉన్న టీడీపీ ఎంపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేశ్‌ను టీడీపీ, జనసేన ఎంపీలు ఘనంగా సత్కరించారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి: సీఐ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

నంద్యాల రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని నంద్యాల తాలూకా సీఐ ఈశ్వరయ్య సూచించారు. సోమవారం శాంతిరామ్ మెడికల్ కళాశాలలో శాంతిరాం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతి రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ వీక్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత్ చావన్ మాట్లాడుతూ శాంతిరామ్ విద్యాసంస్థల్లో ర్యాగింగ్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.శ్రీకాంత్, సర్జరీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



చాగలమర్రిలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివరామానంద ఆశ్రమంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జయంతి వేడుకలు సోమవారం ఉట్టికొట్టే కార్యక్రమంతో ముగిశాయి. విద్యార్థులు చేపట్టిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆళ్లగడ్డకు చెందిన యోగేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో గీతాపారాయణం, భజన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



హుసేనాపురంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్యాపిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హుసేనా పురం గ్రామంలో సోమవారం శ్రీకృష్ణుడి విగ్రహ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ఇందు సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సుధాకర్‌నాయుడు, శివప్రసాద్, మధు, పరమేష్, గోపాల్, జమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో..

అవుకు : మండలంలోని రామాపురం గ్రామంలో త్రైతసిద్ధాంతం, ఇందూజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని ఘనంగా సోమవారం నిర్వహించారు. కృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు శ్రీకృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు మారం పుల్లారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజాలు చేశారు. సాయంత్రం శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకిలో అలంకరించి పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు.

చౌడేశ్వరీమాత ఆలయానికి
రూ.54.29 లక్షల ఆదాయం

బనగానపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో సోమవారం నిర్వహించిన వేలాల్లో రూ. రూ.54.29 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన టెంకాయలు, కిరాణా, క్యాంటిన్, కూల్‌డ్రింక్స్ దుకాణాలకు వేలం నిర్వహించారు. టెంకాలయ వేలంలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పుల్లయ్య రూ.40.40 లక్షలకు దక్కించుకున్నారు. కిరాణదుకాణాన్ని హర్షవర్ధన్ రూ.7.65లక్షలు, హోటల్‌ను గుద్దేటి లక్ష్మీ ప్రసన్న రూ.2.81 లక్షలు, కూల్‌డ్రింక్స్ దుకాణాన్ని గండికోట ప్రేమశేఖర్ రూ.3.43 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈయేడాది రూ.14.62 లక్షలు అదనంగా ఆదాయం లభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ ఈవో బ్రహ్మానందారెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.



వేలంలో పాల్గొన్న ఈవో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది

పాఠశాలలో సరస్వతీ విగ్రహం ఏర్పాటు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్దులాపురం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో దివంగత ఉపాధ్యాయుడు వేణుమాధవ్ కు టుంబ సభ్యులు సరస్వతీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ కలాం, విశ్రాంత ఎంఈవో రాజయ్య, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, రమణయ్య, గదీష్‌బాబు, సీఆర్పీ రాజేష్, వేణుమాధవ్ సతీమణి అరుణ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సరస్వతీ మాత

మద్యం తాగి వాహనం నడిపితే కేసు

డోన్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో నలుగురు ద్విచక్రవాహనదారులు పట్టుబడ్డారు. వీరిని డోన్ ఫస్ట్ క్లాజ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు.

మొలకెత్తిన మొక్కజొన్న రైతుల ఆశలు

- ఎట్టకేలకు విస్తారంగా వర్షాలు
- జిల్లాలో రికార్డు స్థాయిలో 1,52,500 ఎకరాల్లో సాగు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో మొక్కజొన్న రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే ఎట్టకేలకు వరుణుడు కరుణించి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మొక్కజొన్న రైతుల్లో తిరిగి ఆశలు మొలకెత్తాయి. గతేడాది మొక్కజొన్న సాగు చేసిన రైతులకు దిగుబడి, ధరలు ఆశాజనకంగా రావడంతో ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా రికార్డుస్థాయిలో ఇప్పటి వరకు 1,52,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఒక్క కోవెలకుంట్ల, బనగానపల్లె వ్యవసాయ సబ్ డివిజన్ లోనే 21వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. బనగానపల్లెలో తొమ్మిది వేల ఎకరాలు, కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్ లోని కొలిమి గుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, అవుకు మండలాల్లో మొత్తం 10,800ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు.

ఆశాజనకంగా దిగుబడి

గతేడాది మొక్కజొన్న రైతులు ఆశాజనకంగా దిగుబడి సాధించడంతో పాటు గిట్టుబాటు ధర కూడా పలకడంతో రైతులు మొక్కజొన్న విస్తారంగా సాగు చేశారు. చాలా మంది రైతులు ఎకరాకు 30 నుండి 35క్వింటాళ్ల వరకూ దిగుబడి సాధించారు. ధర కూడా క్వింటాలుకు రూ.2200నుంచి రూ.2600వరకూ లభించింది. దీంతో మొక్కజొన్న సాగుతో లాభాలు సాధించవచ్చని అన్నదాతలు ఆశిస్తున్నారు. మరోవైపు గతేడాది కంది, మిరప, పత్తి తదితర పంటలను సాగు చేసిన రైతులు ఆశించిన దిగుబడి, ధరలు లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈఏడాది ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగును చేపట్టారు. ప్రస్తుతం ముందస్తు వర్షాలతో ముందస్తుగా సాగుచేసిన పంట ఏపుగా పెరిగి కళకళలాడుతుండగా, ఇటీవల సాగు చేసిన మొక్కజొన్న మొలకెత్తి భారీ వర్షాలతో నూతన కళ సంతరించుకుంది.



ఏపుగా పెరిగి కళకళలాడుతున్న మొక్కజొన్న

సాగు మరింత పెరిగే అవకాశం



ఈఏడాది మొక్కజొన్నపై రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరిచారు. ఇప్పటికే 10,800ఎకరాల్లో రైతులు మొక్కజొన్న వేశారు. మరింత పెరిగే అవకాశం ఉన్నది.

- సుధాకర్, ఏడీ, కోవెలకుంట్ల

సాగుకు సమాయత్తం

అవుకు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో ఎన్నో ఆశలతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. జీఎన్ఎస్ఎస్ కెనాల్, ఎస్సార్బీసీ కాల్వ ద్వారా నీరు వచ్చి చేరుతుండటంతో అవుకు రిజర్వాయర్‌లో 3.50 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు చేరటంతో మండల వ్యాప్తంగా 20 వేలు ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. దీంతో పొలాల్లో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. కురుస్తున్న వర్షాలతో ఉప్పలపాడు హాయత్‌ఖాన్ చెరువు, కునుకుంట్లలోని దీక్షితులవారి చెరువు, శింగనపల్లెలోని పర్క్యులేషన్ ట్యాంకు నిండిపోయాయి. ఎస్సార్బీసీ ద్వారా వస్తున్న నీటితో మెట్టుపల్లె బాలికుంట చెరువు, వేములపాడు చెరువులు నీటితో నిండిపోయాయి. మండలంలో వరి 10వేలు ఎకరాలు, మొక్కజొన్న 5వేలు ఎకరాలు, మిరప 2వేలు ఎకరాలు, కంది 800 ఎకరాలు, మినుము 210 ఎకరాలు, సాగు అవుతుండగా మిగతా పొలాల్లో వేరుశనగ, పత్తి, పసుపు, హార్టికల్చర్ పంటలను సాగు చేస్తున్నారు. ఈసారి రిజర్వాయర్‌లతో పాటు చెరువులకు ముందస్తుగా నీరు చేరటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

చాగలమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. వక్కిలేరు, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. సోమవారం మండల వ్యాప్తంగా 19.2 మి.మీ., వర్షపాతం నమోదైంది. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల సమీపంలోగల వక్కిలేరు వంతెనపై వరద నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించాయి. రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది 17 వేల క్యూసెక్కులతో ప్రవహించింది. ఆయా గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, పసుపు, మినుము తదితర పంటల్లో వర్షపు నీరు నిలిచింది. కలగట్లపల్లె వక్కిలేరు వరదనీటి ఎస్ఐ సురేష్ పరిశీలించారు. మద్దూరు గ్రామంలో మల్లికార్జునకు చెందిన మట్టిమిద్దె కూలింది. కుందూ, వక్కిలేరు వాగు పరిసర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నది దాటే ప్రయత్నం చేయరాదని తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ సురేష్ సూచించారు.



చాగలమర్రి: పసుపు పంటలో నిలిచిన వర్షపు నీరు



రుద్రవరం: మొక్కజొన్న పంటలో నిలిచిన వాన నీరు

రుద్రవరం: రుద్రవరంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఆదివారం కురిసిన వర్షం 27.2 ఎంఎంగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మొక్కజొన్న, మిరప పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. వాగులు పొంగి ప్రవహించాయి. మిరప తోటలు వర్షానికి దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళనలో పడ్డారు.

కోవెలకుంట్ల: వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నవంతెన వాగు ఉధృగంగా ప్రవహిస్తుడడతో నంద్యాలకు వెళ్లే ప్రయాణికులు ఆగిపోవాల్సిన పరిస్థితివచ్చింది.

కేజీబీవీని జూనియర్ కాలేజీగా మారుస్తా : మంత్రి బీసీ

బనగానపల్లె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను జూనియర్ కళాశాలగా విస్తరించనున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లెలోని కస్తూర్బా పాఠశాలను మంత్రి బీసీ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు మెరుగైన వసతి, భోజన సదుపాయాలు, నాణ్యమైన విద్యను అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను రూ.2.5 కోట్ల నిధులతో అదనంగా మరో ఆరు నూతన గదులు నిర్మించి జూనియర్ కళాశాలగా మారుస్తామన్నారు. నూతన భవన నిర్మాణానికి స్థలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలలో తరగతిగదులను ప్రత్యేకంగా పరిశీలించి బాలికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, బనగానపల్లెకు పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థినులు తమ దుస్తులు శుభ్రం చేసుకోవడానికి దోబీఘాట్ కావాలని మంత్రి దృష్టికి తీసుకు పోగా దోబీఘాట్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠశాల స్టోర్‌రూమ్‌లో ఆహార సామాగ్రి నాణ్యతను, కిచెన్ గదులను పరిశీలించి పలుసూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేణుక , ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి

చివరి ఆయకట్టుకు సాగు నీరు అందిస్తాం

అవుకు : మండలంలో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించాలని రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్ ఆధ్వర్యంలో అవుకు, చెర్లోపల్లె గ్రామాల రైతులు మంత్రి బీసీని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు పరిధిలోని బిళ్లగడ్డ పొలాలకు ఏళ్లతరబడి సరైన పంట కాలువలు లేక సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు గతంలో తన దృష్టికి తెచ్చారన్నారు. అప్పట్లో తన ఆదేశాల మేరకు ఎస్సార్బీసీ అధికారులు వెంటనే స్పందించి తాత్కాలిక పరిష్కారం చూపారని అన్నారు. బిళ్లగడ్డ పొలాలకు సాగు నీరు అందించేందుకు శాశ్వత పరిష్కారం చూపేవిధంగా ప్రణాళికలు రూపొందించి అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తిమ్మరాజు చెరువు నీటిసంఘం సభ్యులు, అవుకు, చెర్లోపల్లె గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి కృతజ్ఞతలు తెలిపిన విజయభాస్కర్‌రెడ్డి

అవుకు సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికైన చల్లా విజయభాస్కర్‌రెడ్డి రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం విజయభాస్కర్‌రెడ్డి మంత్రి నివాసానికి వెళ్లి బీసీ జనార్దన్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

సంజామల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గిద్దలూరు గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ముగిశాయి. మూడు రోజులపాటు స్వామి వారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొలువుదీరిన స్వామి వార్లకు మహిళలు పూజలు చేశారు.



కొలువుదీరిన సీతారామలక్ష్మణులు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. సోమవారం చాగలమర్రి గ్రామంలోని 16వ వార్డులో వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తుండటంతో జలుబు, జ్వరం వచ్చిన వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోవాలని అన్నారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

డోన్ టౌన్: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ప్రసాద్‌గౌడు సోమవారం సూచించారు. ఆయన మాట్లాడుతూ వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని, మీ ఇంటి చుట్టూ పరిసరాలు పనికిరాని వస్తువులు, పూల కుండీలలో వాషింగ్ మిషిన్లు ఎయిర్ కూలర్లు, కొబ్బర చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరాలు, వాంతులు, విరేచనాలు వస్తే సంబంధిత వైద్యులను సంప్రదించాలన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తులు

చాగలమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హత ఉండి లబ్ధి పొందని రైతులు ఈ నెల 20లోగా గ్రీవెన్‌సెల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేసుకోక తిరస్కారానికి గురైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. గత నెల 27 వరకు స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి అర్హులను గుర్తించి ప్రభుత్వం నిధులు జమ చేశామన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు పడుతుండటంతో గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మట్టిమిద్దెల్లో నివసించే వారు తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మట్టి మిద్దెల్లో నివాసం ఉండకూడదు

రుద్రవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వకుళా నది తీరంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య సూచించారు. సోమవారం ఆయా గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉండకూడదని సూచించాలన్నారు. ఇప్పటికే కొందరిని ఖాళీ చేయించి మరో చోట ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు.

రక్షిత మంచినీరు అందించండి

రుద్రవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిల ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్యం లోపించకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామ కార్యదర్శులు వైద్యాధికారులను సంప్రదించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయించాలన్నారు.

'చలో ఒంగోలు'ను విజయవంతం చేయాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఈనెల 20-25న తలపెట్టిన చలో ఒంగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి సూర్యనారాయణ కోరారు. సోమవారం కొలిమిగుండ్ల ఆర్టీసీ బస్టాండులో సీపీఐ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన చలో ఒంగోలు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చంటి, శ్రీరంగ, రాజు, కంబయ్య, నరేష్, రామ్మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులో సోదాలు

రుద్రవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామంలో బెల్టుషాపుపై సోమవారం సోదా చేసినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. సోదాల్లో 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మద్యం విక్రయిస్తున్న గాజా వాసు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే కోట్ల పర్యటన

డోన్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా డోన్ మండలంలో చెరువులు, కుంటలను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం పరిశీలించనున్నారని టీడీపీ నాయకులు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కోట్ల జగదుర్తి, ఉడుములపాడు, మల్లెంపల్లి, బొంతిరాళ్ల, వెంకటాపురం, అబిరెడ్డిపల్లి, దేవరబండ, కొచ్చెర్వు గ్రామాల్లోని చెరువులు, కుంటలను పరిశీలించనున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నిండుకుండలా తుండ్లవాగు రిజర్వాయరు

రుద్రవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవిలోని తుండ్లవాగు రిజర్వాయరు నిండుకుండలా మారింది. ఒక వైపు నల్లమల అటవిలో కురిసిన వర్షం నీరు, మరో వైపు తెలుగుగంగ ప్రధాన కాల్వ నీరు తుండ్లవాగు రిజర్వాయరుకు చేరింది. రిజర్వాయరుకు జలకళ సంతరించుకుంది. రిజర్వాయరులో సోమవారం నింగి నీటిలోకి తొంగి చూసేలా కనిపించింది.

చవితి సందడి షురూ

- వివిధ ఆకృతుల్లో గణపయ్యలు




అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయకుడి ప్రతిమలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతుండటంతో ఎక్కడ చూసినా బొజ్జ గణపయ్యల సందడి నెలకొంది. వివిధ ఆకృతుల్లో రంగు రంగుల వినాయకుడి ప్రతిమలు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే వినాయకుడి ప్రతిమల కొనుగోళు జోరుగా సాగుతోంది. ఆయా గ్రామాల్లోని ఉత్సవ కమిటీ సభ్యులు ఇప్పటి నుంచే వీధుల్లో గణనాథుడి ఏర్పాటు సన్నాహాలు చేపడుతున్నారు. మరోవైపు పలువురు పర్యావరణ ప్రేమికులు మట్టి వినా యకులు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

కోవెలకుంట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీ సెంటరు ప్రమాదాలకు నిలయంగా మారింది. నాలుగు రోడ్ల కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఎటువైపు నుంచి వాహనాలు వస్తున్నాయో అర్థం కాక పాదచారులు భయాందోళన చెందుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వస్తున్నారు. రోడ్డుకు నలువైపులా ప్రభుత్వ ఆస్పత్రి, పాఠశాలలు, దేవాలయాలు, దుకాణాలు ఉన్నాయి. ఎటువైపు నుంచి ప్రమాదం పొంచి ఉందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కోవెలకుంట్లలోని గాంధీ సెంటరు

నీటి కుంటలా రహదారులు




కొత్తపల్లె రహదారిలో నిలిచిన వర్షం నీరు

చాగలమర్రి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓజీ తండా, కొత్తపల్లె, డి.వనిపెంట, గొడిగనూరు గ్రామాలకు వెళ్లే రహదారులు బురద కుంటలను తలపిస్తున్నాయి. ఆయా గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. గత ప్రభుత్వంలో రహదారుల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈవర్షాలకు అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామాల రహదారుల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో ప్రాచీన ఆలయాలు

ప్యాపిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచెర్ల గ్రామంలో శివకేశవస్వామి, లక్ష్మీనరసింహాస్వామి, కాలమ్మ, ఆంజినేయస్వామి ఆలయాల కట్టడాలను పూర్వీకులు ఎంతో అద్భుతంగా నిర్మించారు. అయితే, ఆలయాలు ఆలన, పాలన లేక శిథిలావస్థకు చేరుకుంటుండంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శివకేశవ ఆలయానికి దాదాపు 45 ఎకరాలు, లక్ష్మీనరసింహస్వామి, కాలమ్మ, ఆంజినేయస్వామి ఆలయాలకు దాదాపు 30 ఎకరాల మాన్యం ఉంది. ఏటా వేలం ద్వారా ఆదాయం వచ్చినా దూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న శివకేశవస్వామి ఆలయం